## ఘనంగా దుర్గామాత ఆలయ వార్షికోత్సవం



శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి, నవంబర్ 5 : ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దుర్గాదేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందరర్భంగా మహిళలు పోచమ్మ ఆలయ నుంచి దుర్గామాత ఆలయం వరకు శోభాయాత్ర తీశారు. అనంతరం ఆలయం వద్ద నృత్యాలు చేసి ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అలాగే లిటిల్ స్టార్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు దుర్గాదేవి నాటిక ప్రదర్శించారు. డీ హేమలత యశ్వంత్‌రావు వారి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి సంతోష్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ ఆత్రం రామచందర్, గ్రామ పటేల్ జంగు, కమిటీ సభ్యులు కేంద్రె జ్ఞానేశ్వర్, ఆదిమల దేవేందర్, మనోజ్ జైస్వాల్, ఉల్లాస్ గౌడ్, కంది సత్యం మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న మహిళలు

## సెల్ టవర్‌పై నుంచి పడి యువకుడి మృతి

ఇంద్రవెల్లి, నవంబర్ 5 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన దుర్వ వికాస్(19) సెల్ టవర్‌పై నుంచి పడి మృతి చెందాడు. వికాస్ కొంతకాలంగా పబ్జీ గేమ్‌కు అలవాటు పడ్డాడు. ఈక్రమంలో మానసిక స్థితి కోల్పోయి ఇంటర్ ఫస్టియర్ చదవడం మానేశాడు. శనివారం రాత్రి కూడా పబ్జీ గేమ్ ఆడుతూ బయటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా, ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ముత్నూర్ గ్రామం వద్ద వికాస్ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. సెల్ టవర్‌పై నుంచి పడి మృతి చెందినట్లుగా గుర్తించారు. తల్లి మోహన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ముహూర్తం చూడండి

- పురోహితులు, సిద్ధాంతులను కలుస్తున్న ఎన్నికల అభ్యర్థులు
- 7,8,9,10 తేదీలు మంచి రోజులంటున్న పండితులు
- ఆయా తేదీల్లో నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు

భైంసా, నవంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలైంది. ఈ నెల 10వ తేదీ న ఈ ఘట్టం ముగియనున్నది. కాగా, నామినేషన్లు వేసేందుకు 7, 8, 9, 10 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు సూచిస్తున్నారు. అయితే మంచి రోజును చూసుకునే అభ్యర్థులంతా నామినేష న్లు వేయనున్నారు. మొదటి రోజు శుక్రవారం అయినప్పటికీ షష్టి కావడంతో ఎవరూ నామినేషన్లు వేసేందుకు సుముఖత చూపించకు పోవడంతో తక్కువగా పడ్డాయి. 7న మంగళవారం దశమి, 8న బుధవారం దశమి తదుపరి ఏకాదశి వస్తుంది. 9న గురువారం దశమి తదుపరి ఏకాదశి, 10న శుక్రవారం ద్వాదశితో కూడిన ముహూర్తాలున్నాయి. దాంతో అత్యధికంగా 7,8,9 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

### మంచి రోజులే అనుకూలం..



నామినేషన్లు వే సేందుకు ఈ నెల 7,8,9,10న మంచి రోజులున్నాయి. వీటిలో 4వ తేదీన శనివా రం కాబట్టి ఆ రో జు వద్దని కొంత మంది భావించే అవకాశం ఉంది. అత్యంత అ నుకూలంగా ఈ నెల 7,8,9,10 తేదీల్లో శుభగడియలున్నాయి. కాబట్టి ఈ తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసేందేకు ఎంతో అనుకూలంగా ఉంటాయి.

**- శిరిన్ బెలే, పురోహితులు**

# కేసీఆర్‌తోనే గ్రామాలు సుభిక్షం

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు భారీ షాక్
- కాంగ్రెస్‌వి దిగజారుడు రాజకీయాలు
- అధికారం కోసం మోసపూరిత హామీలు
- ఎమ్మెల్యే అభ్యర్థులు జాదవ్ అనిల్, జోగు రామన్న
- బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



మాట్లాడుతున్న ఆదిలాబాద్‌నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

తాంసి(తలమడుగు), నవంబర్ 5 : సీఎం కేసీఆర్ పాలనలోనే గ్రామాలు సుభిక్షంగా ఉన్నాయని బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. జాదవ్ అనిల్‌కు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు పిడుగు సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీ సంఘం మండల యువ నాయకుడు మేకల రవికాంత్ యాదవ్ వారి అనుచరులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కుల సంఘాల నాయకులు, బీసీ యువజన సంఘాల నాయకులు వెయ్యి మందికి పైగా బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థులు జోగు రామన్న, జాదవ్ అనిల్, మాజీ ఎంపీ నగేశ్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధించాయన్నారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని కొనియాడారు. యువకులు మేధావులు, రైతులు, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. ప్రజా సంక్షేమ కోసం పని చేస్తున్న ప్రభుత్వాలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలను ఇస్తున్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇక్కడ ప్రకటించిన పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని, ఆ పార్టీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం దిగజారుడు రాజకీయాలు చేయవద్దని కోరారు. కులమతాల గురించి మాట్లాడే బీజేపీని పట్టించుకోకుండా ఇంటి పార్టీ బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ప్రజల కోసం పని చేసే పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కార్యకర్తలను కోరారు. ప్రతి కార్యకర్తకు తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

### కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దాం

**ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న**

దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న విష ప్రచారాన్ని నియోజకవర్గంలో అన్ని స్థాయిల బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పి కొడుతున్నారు. తొమ్మిది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గంలో జరిగిన ప్రగతి 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గానికి పట్టిన దుర్గతిని కండ్లకు కడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముందుకు దూసుకుపోతున్నాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై చేస్తున్న ప్రచారంలో నిజానిజాలు తమకు తెలుసని ప్రజలు బీఆర్‌ఎస్‌కు బాసటగా మన బోథ్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం జాదవ్ అనిల్‌ను ఆశీర్వదించి ఈ నెల 30వ తేదీన మీ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### రూ.50 వేలు విరాళం అందించిన గ్రామస్తులు

బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ నామినేషన్ వేసి భారీ మెజార్టీతో గెలవాలని అర్లి గ్రామస్తులు కోరారు. నామినేషన్ కోసం రూ.50 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మేకల రవికాంత్ యాదవ్, కళ్లెం కరుణాకర్ రెడ్డి, వసంత్ రెడ్డి, నేతుల గంగన్న, అసం రవీందర్, అభిరాం రెడ్డి, శ్రీకాంత్, ఎంపీపీ సురకుంటి మంజులాశ్రీధర్ రెడ్డి, మొట్టె కిరణ్‌కుమార్, తొట వెంకటేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏజెన్సీని అభివృద్ధి చేసి చూపిస్తా

- ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్
- ఉట్నూర్‌లో రోడ్‌షో



మాట్లాడుతున్న ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్

ఉట్నూర్, నవంబర్ 5 : ఉట్నూర్ ఏజెన్సీని అభివృద్ధి చేసి చూపిస్తానని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఆదివారం సంతలో తన అనుచరులు, కార్యకర్తలతో రోడ్‌షో నిర్వహించారు. పలు కూడళ్లలో ప్రజలతో మాట్లాడుతూ ఏజెన్సీ కష్టాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలుపొందగానే అధికంగా ఏజెన్సీకి నిధులు తీసుకొచ్చి ఉట్నూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, ఉట్నూర్ మినీ ట్యాంక్‌బండ్ మరింత అభివృద్ధి, సెంట్రల్ రోడ్డు, విద్య, వైద్యంలో మార్పులు తీసుకొస్తామన్నారు. అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. యువతకు పెద్దపీట వేసి ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. ఇవన్ని కావాలంటే తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కుందుకూరి రమేశ్, నాయకురాలు జాదవ్ సుమన్ బాయి, వైస్ ఎంపీపీ బాలాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జోరుగా ప్రచారం

జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, వైస్ ఎంపీపీ బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మండల కేంద్రంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సలీం, వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు